అరకొర వసతులతో అవస్థలు

- అసౌకర్యాల నడుమ రాకెట్ల పీహెచ్‌సీ
- రోగులకు నరకయాతన
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో అత్యాధునిక హంగులతో నిర్మాణం
- పీహెచ్‌సీని ప్రారంభిస్తే వైఎస్సార్‌సీపీకి పేరొస్తుందని అధికార పార్టీ నేతల అసూయ
- మంత్రి పయ్యావుల ఇలాకాలో అందని వైద్యసేవలు



శిథిలావస్థకు చేరిన భవనంలో కొనసాగుతున్న రాకెట్ల పీహెచ్‌సీ

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైద్య రంగానికి పెద్దపీట వేశారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందేవి. కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించేవారు. ఎక్కడికక్కడ పేదలు అవస్థలు పడకుండా పల్లెల్లోనే శిబిరాలు ఏర్పాటు చేసేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వైద్యసేవలు మృగ్యమయ్యాయి. అరకొర వసతులతో రోగులు అవస్థలు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి పేరొస్తుందని అత్యాధునిక హంగులతో నిర్మాణమైన రాకెట్లలో పీహెచ్‌సీని ప్రారంభించలేదు. మంత్రి పయ్యావుల ఇలాకాలోనే వైద్యసేవలు అందడం లేదని ప్రజలు, రోగులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి సొంత గ్రామమైన రాకెట్లలో పీహెచ్‌సీ భవనం నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.1.85కోట్ల నిధులు మంజూరు చేశారు. అత్యాధునిక వసతులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం పూర్తయ్యింది. పీహెచ్‌సీ భవనం ప్రారంభానికి సిద్ధమవుతుండగా సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యింది. ఎన్నికలకోడ్‌తో భవనం ప్రారంభానికి నోచుకోలేదు.


రాకెట్ల డిస్పెన్సరీలో ఇరుకు గదిలో ఏర్పాటు చేసిన బెడ్లు

ఇరుకు గదిలోనే డిస్పెన్సరీ...

మండలంలో పెద్ద గ్రామంగా గుర్తింపు పొందిన రాకెట్ల గ్రామంలో అరకొర వసతుల మధ్య శిథిలమైన డిస్పెన్సరీలో వైద్యసేవలు అందిస్తున్నారు. డిస్పెన్సరీలో వైద్యులు, వైద్య సిబ్బందికి ప్రత్యేక గదులు లేకపోవడంతో వైద్యం కోసం వచ్చిన రోగులు కూర్చోడానికి కూడా బెంచీలు లేవు. బల్లలపైనే మందులు, ఇతర సామగ్రి భద్రపర్చుకోవాల్సి వస్తుంది. రోగులకు ప్రాథమిక వైద్యం అందించేందుకు బెడ్లు కూడా ఏర్పాటు చేసేందుకు స్థలం లేదు.

ప్రారంభం కాని భవనం



రాకెట్ల పీహెచ్‌సీకి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని హంగులతో పీహెచ్‌సీ భవనం నిర్మించారు. ఇందులో భాగంగా కొత్త పీహెచ్‌సీలో అన్ని విభాగాలకు ప్రత్యేక గదులు, ఆక్సిజన్ సిలిండర్లు, మహిళల వైద్య పరీక్షలకు ప్రత్యేక గైనిక్ వార్డుతో పాటు వైద్య సిబ్బందికు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం నూతన పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తే వైఎస్సార్‌సీపీకి మంచి పేరు వస్తుందని, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కృషి ఫలితమేనని ప్రజలు చర్చించుకుంటారని అధికార పార్టీ నేతలు పీహెచ్‌సీ భవనం ప్రారంభించకుండా అడ్డుపడుతున్నారని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

భవనాన్ని వైద్య ఆరోగ్యశాఖకు అప్పగిస్తాం

పీహెచ్‌సీ భవన నిర్మాణానికి రూ.1.85 కోట్లు మంజూరు కాగా, ఇందులో రూ.1.25 కోట్లతో ఆస్పత్రి భవనం పూర్తయ్యింది. ఇంకా రూ.14 లక్షల అంచనా వ్యయంతో ప్రహరీ నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయి. మిగితా రూ.63 లక్షలతో సామగ్రి కొనుగోలు చేయనున్నాం. వీలైనంత త్వరగా ప్రహరీ నిర్మాణం పూర్తి కాగానే వైద్య ఆరోగ్య శాఖకు భవనాన్ని అప్పగిస్తాం.

– కావ్య, ఆర్‌అండ్‌బీ జేఈ, ఉరవకొండ

అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈసీసీఈ శిక్షణ

రాయదుర్గంటౌన్: ప్రారంభ బాల్య సంరక్షణ, విద్య (ఈసీసీఈ) విధానాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ప్రారంభించారు. మంగళవారం స్థానిక ఏపీ మోడల్‌స్కూల్‌లో జరిగిన శిక్షణకు రాయదుర్గం అర్బన్, మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరయ్యారు. ఈ నెల 18, 19, 20, 22,24,25 తేదీల్లో ఆరు రోజుల శిక్షణ ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ తెలిపారు. ఎంఈఓ నాగమణి హాజరై వారికి ఈసీసీఈపై అవగాహన కల్పించారు. శిక్షణకు డీఆర్‌పీలు హరినాథ్, మురళీకృష్ణ హాజరయ్యారు.

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోండి

కళ్యాణదుర్గం: అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న సూచించారు. మంగళవారం స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సర్టిఫికెట్ కోర్సు (జ్ఞానజ్యోతి) శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. సీడీపీఓ, ఎంఈఓ విజయకుమారి, డీఆర్పీలు కరుణాకరన్, రమేష్‌బాబు, నారాయణస్వామి శిక్షణ ఇచ్చారు. సీడీపీఓ మాట్లాడుతూ కళ్యాణదుర్గం, కంబదూరు ప్రాజెక్టుల పరిధిలో మొదటి విడత 18 నుంచి 20 వరకు, రెండో విడత 22 నుంచి 25వ తేదీ వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భారతి, అరుణ, ఓబులమ్మ పాల్గొన్నారు.


శిక్షణలో మాట్లాడుతున్న సీపీడీఓ లక్ష్మీప్రసన్న

అంగన్‌వాడీలకు సర్టిఫికెట్ కోర్సుపై శిక్షణ

బ్రహ్మసముద్రం : అంగన్‌వాడీ టీచర్లకు సర్టిఫికెట్ కోర్సుపై విద్యాశాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 కృష్ణా నాయక్, డీఆర్పీలు అర్చన, రామాంజనేయులు, జగదీష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఖాసీంబీ , అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రీ స్కూళ్లు బలోపేతానికి కృషి చేయండి

కణేకల్లు: ప్రీ స్కూళ్ల బలోపేతం చేయడానికి అంగన్‌వాడీ వర్కర్లు కృషి చేయాలని ఎంఈఓ లక్ష్మణ తెలిపారు. మంగళవారం స్థానిక మోడల్‌స్కూల్‌లో ప్రీ స్కూళ్లను బలోపేతం చేసేందుకు 'జ్ఞానజ్యోతి' కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ల బోధనతీరు మెరుగుపరిచేందుకు 120 రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ తరగతుల కార్యక్రమానికి తప్పని సరిగా హాజరు కావాలని ఇన్‌చార్జ్ సీడీపీఓ లక్ష్మీ తెలిపారు. డీఆర్పీలు ఓబన్న, అనిల్, రామాంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమ, గీత, శాంత పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మణ

జ్ఞానజ్యోతి శిక్షణతో బోధనా నైపుణ్యం

బొమ్మనహాళ్: అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి శిక్షణతో బోధనా నైపుణ్యం పెంపొందుతుందని ఎంఈఓలు మల్లారెడ్డి, హరికృష్ణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వెంకట ప్రసాద్ అధ్యక్షతన జరిగిన 'జ్ఞానజ్యోతి' శిక్షణ తరగతులకు ఎంఈఓలు, ఆర్‌పీలు పాల్గొన్నారు. ఆర్‌పీలు ఫక్రుద్దీన్, మోహన్‌రాజు, మహేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖలు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే భవిష్యత్


మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీదేవి

వజ్రకరూరు: విద్యార్థినులు కష్టపడి చదివితేనే భవిష్యత్ ఉంటుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శ్రీదేవి తెలిపారు. మంగళవారం తట్రకల్లులోని కేజీబీవీలో కిశోర వికాసం–స్వీయ రక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం బాలికల హక్కు లు – చట్టాలపై ఆర్టీటీ కళా బృందాలు అవగాహన కల్పించాయి. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ధనలక్ష్మి, ఏసీడీపీఓ యల్లమ్మ, సూపర్‌వైజర్లు పద్మావతి, హెచ్.పద్మా, ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వరి, ఐసీడీఎస్ ప్రతినిధులు రమాదేవి,వెంకట్, పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన బూదగవి శ్రీసూర్యనారాయణస్వామి ఆలయ హుండీ కానుకలు మంగళవారం లెక్కించారు. ఆలయ ఈఓ విజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాణి, సూర్యనారాయణ సేవా సమితి ప్రతినిధి చిరంజీవి ఆధ్వర్యంలో హుండీ కానుకలు లెక్కించారు. ఆలయంలోని రెండు శాశ్వత హుండీలను లెక్కించగా, రూ.85,177 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో సూర్యనారాయణస్వామి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు ఇవ్వాలని నిరసన

కళ్యాణదుర్గం: డిమాండ్లు పరిష్కరించాలని శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం సమస్యలు పరిష్కరించాలని పంప్‌హౌస్‌లకు తాళాలు వేసి, నిరసన తెలియజేశారు. ముందుగా ప్రకటించిన విధంగానే కార్మికులు ఈనెల 18 నుంచి సమ్మెలోకి వెళ్లారు. దీంతో నియోజకవర్గంలో శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా ఆగిపోయింది. తాగునీరు లేక పలు గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కార్మికులకు మద్దతుగా సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఓబులు నిరసనకు హాజరై మాట్లాడారు. ఫేజ్–1 కార్మికులకు ఐదు నెలల వేతనాలు 30 నెలలు బకాయి, పీఎఫ్ చెల్లించాల్సి ఉందన్నారు. హిందూపురం, మడకశిర, పరిగి కార్మికులకు 10 నెలల వేతనాలు, 30 నెలల పీఎఫ్ బకాయిలు చెల్లించాలని, పీఏబీఆర్‌లో ఫిల్టర్ బెడ్లు మార్చలేదని వాపోయారు.

కార్మికుల వేతన బకాయిపై చర్చలు..

అనంతరం పథకం అధికారులు, కాంట్రాక్టర్, సీఐటీయూ రాష్ట్ర నేత ఓబులు కలిసి స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు స్వగృహంలో కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలపై చర్చలు జరిపారు.అనంతరం ఎమ్మెల్యే పంపు హౌస్ వద్దకు చేరుకొని కార్మికులతో మాట్లాడారు. కాంట్రాక్టర్ బకాయిలు చెల్లించకపోతే వేతనాలు తన సొంత డబ్బుతో చెల్లిస్తానని హామీ ఇవ్వడంతో కార్మికులు తమ నిరసన విరమించారు. అనంతరం మోటర్లను ఆన్‌చేసి నీటి సరఫరా పునరుద్ధరించారు. కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి వాటర్ స్కీమ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నరేష్, ప్రభాకర్, రమేష్, రాములతో పాటు కార్మికులు పాల్గొన్నారు.


శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం పంపు హౌస్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

బెళుగుప్ప: మండలంలోని శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులు సోమవారం అర్ధరాత్రి నుంచి సమ్మె చేశారు. దీంతో మండలంలోని 24 గ్రామాలకు నీటి సరఫరా ఆగిపోయింది. కార్మికులకు ఆరు నెలల వేతనాలు ఇవ్వాలని, వేతనాలు అందక 850 కార్మిక కుటుంబాలు అవస్థలు పడుతున్నాయని గంగవరం పంప్‌హౌస్ కార్మిక సంఘాల నాయకులు రాము, చిక్కన్న, రాఘవేంద్ర తదితరులు తెలిపారు. అనంతరం కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కళ్యాణదుర్గం పంహౌస్ వద్దకు వెళ్లి కార్మికులకు హామీ ఇవ్వడంతో సమ్మె విరమించారు.

రాయదుర్గంటౌన్: శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు సోమవారం అర్ధరాత్రి నుంచి సమ్మె చేపట్టారు.దీంతో రాయదుర్గం పరిధిలోని పీఏబీఆర్, ఆలూరు, టీ.వీరాపురం, రాయదుర్గంలోని పంపుహౌస్‌ల్లో మోటార్లు బంద్ అయ్యాయి. దాదాపు 75 మంది లైన్‌మెన్‌లు, ఆపరేటర్లు సమ్మెలో పాల్గొన్నారు. పంపుహౌస్ పరిధిలోని దాదాపు 114 గ్రామాల్లో తాగునీరు సరఫరా నిలిచిపోయింది. 10 నెలల వేతన బకాయిలు, 30 నెలలుగా బకాయి పడిన పీఎఫ్ మొత్తం వెంటనే జమ చేయాలనే ప్రధాన డిమాండ్లతో సమ్మెలో దిగారు.

ఆస్తి, నీటి పన్ను వసూళ్లలో పురోగతి

రాయదుర్గంటౌన్: ఆస్తి, నీటి పన్ను వసూళ్లలో రాయదుర్గం మున్సిపాలిటీ పురోగతి సాధించింది. పన్ను వసూళ్లకు వార్డుల్లోనే ప్రత్యేక పన్ను వసూలు కౌంటర్లు ఏర్పాటు చేయడంతో లక్ష్యానికి చేరువవుతున్నారు. వార్డులు, ఇంటింటి పన్నుల వసూలు, కార్యాలయంలోనూ ప్రత్యేక కౌంటర్ ద్వారా వందశాతం పన్ను రాబట్టేందుకు అన్ని చర్యలు చేపట్టారు. రోజూ ఒక వార్డులో ప్రత్యేక పన్ను వసూలు కేంద్రాన్ని ఏర్పాటు చేయించి, పన్ను వసూళ్లపై కమిషనర్ దివాకర్‌రెడ్డితోపాటు ఆర్‌ఐ సత్యనారాయణ, మున్సిపల్ ఏఈ నరసింహులు, బిల్ కలెక్టర్లు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో దృష్టి సారించారు. పురపాలక సంఘంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు సంబంధించిన డిమాండ్ రూ.5.32 కోట్లకు గాను మంగళవారం నాటికి రూ.2.91 కోట్లు వసూలు చేశారు. నీటికొళాయి పన్ను డిమాండ్ రూ.3.90 కోట్లకు గాను ఇప్పటి దాకా రూ.1.83 కోట్లు వసూలు చేశారు. నీటి పన్ను వసూళ్లలో జిల్లాలో 46.90 శాతంతో రాయదుర్గం మొదటి స్థానంలో ఉంది. 46.10 శాతంతో తాడిపత్రి రెండో స్థానంలో ఉంది. నీటి పన్నుల వసూళ్లలో రాయదుర్గం పురపాలక సంఘం రాష్ట్ర స్థాయి టాప్‌టెన్‌లో 8వ స్థానంలో ఉంది. కాగా ఆస్తి పన్ను వసూళ్లలో జిల్లా స్థాయిలో 49.10 శాతంతో తాడిపత్రి, గుత్తి తరువాత రాయదుర్గం మున్సిపాలిటీ మూడో స్థానంలో నిలిచింది.


ప్రత్యేక కేంద్రంలో పన్ను స్వీకరిస్తున్న ఆర్‌ఐ సత్యనారాయణ, బిల్ కలెక్టర్లు

క్లుప్తంగా

విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ


కంటి అద్దాలను అందిస్తున్న ఇన్‌చార్జ్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్

కళ్యాణదుర్గం: దృష్టిలోపం ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. మంగళవారం పట్టణంలోని ఏపీ మోడల్ పాఠశాల, కేజీబీవీ, నార్త్ ఉన్నతపాఠశాలల్లో చదువుతూ దృష్టిలోపం ఉన్న 45 మందికి కంటి అద్దాలను అందజేశారు. ఇన్‌చార్జ్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, ఆప్తాల్మిక్ ఆఫీసర్ రమణ అద్దాలను పంపిణీ చేశారు. ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు అధికంగా ఉండేలా చూసుకోవాలని, అద్దాలు రెగ్యులర్‌గా వాడాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల సిబ్బంది, సచివాలయ ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మాఘ పౌర్ణిమ, శివరాత్రి ప్రత్యేకతపై ప్రచారం

కూడేరు: మండలంలోని జల్లిపల్లిలో మంగళవారం త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మాఘ పౌర్ణిమ, మహా శివరాత్రి విశిష్టతపై ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జ్ఞాన వేదిక ఉరవకొండ నియోజక వర్గ కమిటీ అధ్యక్షుడు రామాంజనేయులు, సభ్యులు ఎల్లమ్మ, ఉమాదేవి, కృష్ణవేణి, చందు, అనిత, నిఖిల్, సురేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతోనే మేలైన దిగుబడి

కుందుర్పి: సేంద్రియ వ్యవసాయం ద్వారానే అధిక దిగుబడి సాధించొచ్చని సీఎన్‌ఎఫ్ (కమ్యూనిటీ నాచురల్ ఫార్మింగ్) ప్రాజెక్ట్ జిల్లా కోఆర్డినేటర్ లక్ష్మణ్ నాయక్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని తమ్మయ్య దొడ్డి గ్రామంలో సీఎన్‌ఎఫ్ ప్రాజెక్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయం, విత్తన శుద్ధి విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం, విత్తన శుద్ధి ద్వారానే ఆశించిన దిగుబడి సాధ్యమన్నారు. అనంతరం అక్కడే విత్తన శుద్ధి ఎలా చేయాలో చూపించారు. సుమారు 20 రకాల పంటలకు సంబంధించిన విత్తన శుద్ధి చేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, సీఎన్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సయ్యద్ జాఫర్ షావలి షంషీర్ ఉత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కొండపై వెలసిన సయ్యద్ జాఫర్‌షావలి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వేకువజామున షంషీర్ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. దర్గా నుంచి బయల్దేరిన షంషీర్ ఉత్సవం బళ్లారి రోడ్డులోని బర్కత్‌షావలి దర్గా వరకు కొనసాగింది. భక్తులు జాఫర్‌షావలి కీర్తనలు పఠిస్తూ ఊరేగించారు. అనంతరం కొండపై దర్గాకు చేరుకోగా ముజావర్లు ప్రత్యేక ఫాతెహా పఠించారు. బుధవారం జియారత్ కార్యక్రమాలతో ఉరుసు ముగుస్తుందని దర్గా కమిటీ నిర్వాహకులు తెలిపారు.

మరుగుదొడ్ల పనుల పరిశీలన

కూడేరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సర్వశిక్షా అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ) శైలజ మంగళవారం తనిఖీ చేశారు. నాడు–నేడు మొదటి విడతలో మరుగుదొడ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఆగిపోయాయి. దీంతో బాలురు మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారని హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఏఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, ఎంఈఓ–2 సాయి కృష్ణ పాల్గొన్నారు.

రైతులు సర్వేకు సహకరించాలి


రైతులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

కూడేరు: రైతులు సహకరిస్తే పక్కాగా రీసర్వే జరుగుతుందని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న తెలిపారు. రెండో విడతలో భాగంగా జయపురంలో జరుగుతున్న భూసర్వేను అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న మంగళవారం తనిఖీ చేశారు. రెవెన్యూ భూరికార్డు మేరకు ఎలాంటి తప్పులు లేకుండా సర్వే చేసి, రైతులకు హద్దులు చూపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆమె రైతుల తో మాట్లాడారు. అభ్యంతరాలుంటే నివృత్తి చేసుకోవాలన్నారు. ఉరవకొండ తహసీల్దార్ మహబూబ్ బాషా, రీసర్వే డీటీ ప్రసాద్, మండల సర్వేయర్ అయేషా సిద్దికీ, వీఆర్వోలు, గ్రామ సర్వేలు పాల్గొన్నారు.

అడిగుప్పలో రాజుల దేవర

గుమ్మఘట్ట: అడిగుప్ప గ్రామంలో రాజుల దేవరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి ఉత్సవ విగ్రహాలను వేపులపర్తి క్రాస్ వద్ద వేదావతి హగరి జలధికి తీసుకెళ్లి, పవిత్ర గంగా జలంతో అభిషేకించారు. అనంతరం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి విగ్రహాన్ని గ్రామంలో వీధులలో డప్పులతో ఊరేగించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు


పెద్దమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

కూడేరు: మండలంలోని ముద్దలాపురం, ఉదిరిపికొండ గ్రామాల్లో పెద్దమ్మ, ముత్యాలమ్మ అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆయా దేవతామూర్తుల ఊరు దేవర జరిగి నెల రోజులయిన సందర్భంగా మండల పూజ చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

భూసార పరీక్షలు తప్పనిసరి


పొలం పిలుస్తోందిలో మాట్లాడుతున్న ఏడీఏ పద్మజ

ఉరవకొండ: ప్రతి రైతూ విశిష్ట గుర్తింపు సంఖ్య కలిగి ఉండాలని, ఇందుకోసం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఏడీఏ పద్మజ తెలిపారు. మంగళవారం ఉరవకొండ, వెలిగొండ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో ఏడీఏ, ఏఓ శుభకర్‌లు సమావేశమయ్యారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షాల ఆధారంగా ఎరువులను వాడాలన్నారు. విచక్షణ రహితంగా ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి భరత్ తదితరులు పాల్గొన్నారు.

'సూపర్‌సిక్స్' అమలు చేస్తాం


మాట్లాడుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్

కళ్యాణదుర్గం: సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామని శాసనమండలి మాజీ చైర్మన్, ప్రభుత్వ సలహాదారు షరీఫ్ తెలిపారు. మంగళవారం కళ్యాణదుర్గం పర్యటనకు వచ్చిన ఆయన..స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాబోవు విద్యా సంవత్సరం నుంచి 'తల్లికి వందనం' ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ముస్లింల కోసం ప్రత్యేక సబ్సిడీ రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మోహిద్దీన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెట్ షఫీకి అభినందన


కానిస్టేబుల్ షఫీని అభినందిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: మాస్టర్ అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన కానిస్టేబుల్ షఫీని ఎస్పీ జగదీష్ అభినందించారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో నీలం సంజీవరెడ్డి మైదానంలో ఈవెంట్స్ జరిగాయి. ఇందులో కళ్యాణదుర్గం పీఎస్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ షఫీ నాలుగు పతకాలు సాధించి, మార్చి 4న బెంగళూరు వేదికగా ప్రారంభమయ్యే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. దీంతో మంగళవారం ఎస్పీ జగదీష్ తన చాంబర్‌లో షఫీని ప్రత్యేకంగా అభినందించారు.

సైబర్ నేరాలపై అవగాహన

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని మంగళకుంట గ్రామంలో మన భద్రత – మన బాధ్యత అనే కార్యక్రమంపై మంగళవారం అవగాహన కల్పించారు. రూరల్ సీఐ వంశీకృష్ణ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా సైబర్‌నేరగాళ్ల బారిన పడినట్లయితే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి, సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మంజునాథ, హనుమంతప్ప పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

శెట్టూరు: మండల కేంద్రానికి చెందిన లింగారెడ్డి కుమార్తె వరలక్ష్మి రెండు రోజులుగా కనిపించలేదని కుటుంబ సభ్యులు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లేదు. వరలక్ష్మి సోదరుడు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రాంభూపాల్ తెలిపారు.

ఘనంగా యోగి వేమన జయంతి


కోనాపురంలో యోగివేమన జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

గుమ్మఘట్ట: కోనాపురంలో యోగి వేమన జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. రెడ్డి సంఘం ఆధర్యంలో యోగివేమన చిత్రపటానికి పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ యువనాయకుడు మెట్టు విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు. ఆర్‌టీ జగన్‌మోహన్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, చిదా నందరెడ్డి, నాగిరెడ్డి, రాజ శేఖర్, లక్ష్మీరెడ్డి, బాలరెడ్డి, మంజునాథరెడ్డి, రమేష్ రెడ్డి, మల్లారెడ్డి, కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు రుణాలకు ఇంటర్వ్యూలు

కూడేరు: బీసీ కార్పొరేషన్ రుణాలకు

సంక్షిప్త సమాచారం

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు ఇంటాయని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు పరిధిలోని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయన్నారు. మధ్యాహ్నం జల్లిపల్లి ఏపీజీబీ, కూడేరు స్టేట్‌బ్యాంకు, పెనకచెర్ల కెనరా బ్యాంకు పరిధిలోని వారికి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

21,22న ఇంటర్వ్యూలు

బొమ్మనహాళ్: బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 21,22వ తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయన్నారు.

దరఖాస్తుల పరిశీలన వాయిదా

గుమ్మఘట్ట: సబ్సిడీ రుణాల దరఖాస్తుల పరిశీలన వాయిదా పడినట్లు ఎంపీడీఓ రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీఐ పరిధిలో ఈనెల 19 న జరగాల్సిన దరఖాస్తుల పరిశీలన ఈ నెల 21కి వాయిదా వేసినట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి భరోసా

గుమ్మఘట్ట: కలుగోడులో హనుమంతరెడ్డి కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రంజిత్(24) ఉరి వేసుకొని సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వైఎస్సార్‌సీపీ యువనాయకుడు మెట్టు విశ్వనాథరెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి,నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గౌని లక్ష్మీకాంతారెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు వన్నప్ప, ఆర్డీ లక్ష్మీకాంతారెడ్డి పాల్గొన్నారు.